రంగారెడ్డి I వికారాబాద్ I మేడ్చల్
వార్త



# చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు

కీసర,ఆగస్టు8,ప్రభాతవార్త:
శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం ఆలయ ఛైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతుల చేతుల మీదుగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిగింది. నగరం నలుమూలల నుండి భక్తులు ఆ వరలక్ష్మీ వ్రతంలో అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు.ఈ సందర్బంగా ఆలయ ఛైర్మన్ మాట్లాడుతూ శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం ఒక హిందూ ఆచారమన్నారు.వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భ్యార్య,హిందూ మత ప్రకారం ఈ పండుగ చాలా విశిష్టమైనదన్నారు.వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారన్నారు.ఈ పూజలు ఆంద్రప్రదేశ్,తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారన్నారు.ఈ పండుగ ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారని అన్నారు.ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకుంటారని తెలిపారు.అ దేవతను పూజిస్తే అష్టైశ్వర్యాలు అయిన సంపద,భూమి, శిక్షణ,ప్రేమ,కీర్తి, శాంతి,సంతోషం,శక్తి వంటివి లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారపు శ్రీ హరిగౌడ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్ ఆజం అలీ

**కేశంపేట ఆగస్టు 8 ప్రభాతవార్త :** ప్రకృతి వైపరీత్యాల దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశంపేట తహసిల్దార్ ఆజం అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఎలాంటి విపత్తులు జరగకుండా ముందస్తుగా మండల ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఆదేశా మేరకు మండల ప్రధాన కార్యాలయంలో నియంత్రణ గదిని ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా సంభవించే మానవ నష్టం, ఇంటి నష్టం, జంతు నష్టం, వంటివి జరగకుండా ఉండే విధంగా పర్యవేక్షించేందుకు ఇబ్బందిని నియమించామని, మండల పరిధిలో ఎలాంటి విపత్తులు జరిగిన, జరిగేందుకు అవకాశం ఉన్న అలాంటి సమాచారాన్ని మా సిబ్బందికి తెలియపరచాలని ఆయన అన్నారు. ఆర్ ఐ చెన్నకేశవులు, రికార్డ్ అసిస్టెంట్ జంగయ్య సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, జూనియర్ అసిస్టెంట్ శివ, సీనియర్ అసిస్టెంట్ మహేష్, జూనియర్ అసిస్టెంట్ జంగేశ్, లను నియమిస్తున్నట్లు తహసిల్దార్ తెలిపారు మండలంలో ఎలాంటి విపత్తులు జరిగిన 99480 44523, 99121 70411, 9398094490, 7799363553, 9441579527, 9848206029. ఈ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన సూచించారు.

# బూత్‌స్థాయి ఏజెంట్లను తప్పనిసరి నియమించుకోవాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8, ప్రభాతవార్త ః**
ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలకు బూతు స్థాయి ఏజెంట్ల ను తప్పని సరిగా నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో బూతు స్థాయి ఏజెంట్ల ప్రాధాన్యత ఎంతో అవసరమని, వంద శాతం ఏజెట్ల నియామకానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఏజెంట్ల ని యామకం ఆగస్టు 14 లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకూడదనే నిబంధనల మేరకు ఎన్నికల కమిషన్ అ నుమతి మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలలో 1200 కు పైగా ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించి సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా లో మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా ప్రజలకు చేరే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. 100 సంవత్సరాలు పూర్తయిన ఓటర్లను గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కుటుంబం లోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఏవైనా సందే హాలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలతో పాటు 4 నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని కలెక్టర్ సూ చించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాంరెడ్డి,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడే రాఖీ పండగ



**నవాబుపేట ఆగస్టు 8,ప్రభాతవార్త :**
విభిన్న ఇతిహాసాలను పాటిస్తూ జరుపుకునే అపురూపమైన పండగా రక్షాబంధన్ (రాఖీపండగ) నేడు రక్త సంబంధికులను ప్రేమతో, అనురాగంతో, అప్యాతతో కట్టిపడేసే అపురూప ఘట్టం ఈ పండగా పట్టింపులకు పోకుండా ఆడపడుచుల కళ్ళల్లో కనీళ్ళు రాకుండా ఆనందబాస్పలు వచ్చేవిధంగా వారిని అక్కున చేర్చుకుని రాఖీ పండగను జరుపుకోవాలి. ఇంద్రుడు రాక్షసులతో యుద్ధం చేస్తూ ఓటమి అంచున ఉన్నప్పుడు ఆయన సతీమణి సచిదేవి నేనున్నాని రక్షా సూత్రాన్ని కట్టిందని దీంతో ఇద్రుడు ఘనవిజయం సాధించాడని దీనికి ప్రతీకగా ఈ పండగ జరుపుకుంటారని ఓ కథనం ఉంది. అదేవిధంగా విష్ణదేవుడు బలిచక్రవర్తిని పాతాలానికి పంపుతున్నప్పుడు ఆయన భార్య లక్ష్మీదేవి బలిచక్రవర్తికి రాఖీ కట్టి వదిలిపెట్టమని వేడుకుందని ఈ నేపథ్యంలో వారి మధ్య సయోధ్యకుదరి బంధం బలపడిందని ఈ ఇతిహాసం ప్రకారం పండగ జరుపుకోవడం ఒక రివాజు, మహాభారతంలో ద్రౌపది కృష్ణుడు చేతికి గాయమైతే ద్రౌపది చీరకోంగు చించి కట్టుకట్టడంతో రక్త సంబంధం మరింతగా బలపడిందని ఈ నేపథ్యంలో కృష్ణుడు సదా రక్షణగా నిచిన తరుణంలో ఈ పంగను జరుపుకోవడానికి ఒక కథనం ఉంది. ఏదియేమైనా అన్న చెల్లేళ్ళు, అక్కా తమ్ముళ్ళ అనురాగానికి రక్తసంబంధానకి ప్రతీకైన ఈ పండగను సంబురంగా జరుపుకోవాలి. ఇదిలా ఉండగా రోజు రోజుకు రక్తసంబంధాలు పలచబడుతున్నాయని అన్న చెళ్ళల్ల మధ్య, అక్క తమ్ముళ్ళ మధ్య మనస్పర్థలు ఏర్పడి రాఖీ పండగకు దూరంగా ఉంటున్న సందర్భాలు కోంత ఇబ్బందిగా మారాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఆస్తుల తగాదాలు బంధాలను అగాధంలోకి తోక్కేస్తున్నాయని వారి మధ్య అంతరాలు పెరిగి దూరాన్ని పాటించడంతో ఈ పండగ ఉనికి దెబ్బతింటోందని అంటున్నారు. తల్లి తండ్రుల ఆస్థిలో ఆడపడుచులకు చట్టపరంగా హక్కు ఉన్న తరుణంలో కొందరు ఆడ పడుచులు అన్నదమ్ములపై నాయ్యస్థానాలను ఆశ్రమించడం లాంటి చర్యలు చోటుచేసుకోవడం, ఇతరాత్ర సమస్యలు బంధాలని బలహీనం చేస్తున్నాయని పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నచాటి చేతలు గుర్తుచేసుకుని కలిసిమెలసి రాఖీ పండగను ఆస్వాధించాలని సూచిస్తున్నారు.

## కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

**యాలాల ఆగస్టు 8,ప్రభాతవార్త :** కరెంట్ షాక్‌కు గురై ఓ యువ రైతు మృతి చెందాడు. ఈ దుర్ఘటన యాలాల మండలంలోని ముద్దాయిపేట గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. యాలాల ఎస్ఐ. విఠల్, కుటీంభికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి....ముద్దాయిపేట గ్రామానికి చెందిన పాలెపల్లి రమేష్(38)కు గ్రామంలో 10 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ పొలంలో వరి పంటసాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన పొలానికి నీళ్ల పెట్టడానికి వెళ్లాడు. బోరు మోటారునకు సంబంధించిన సర్వీస్‌వైర్ కిందపడిఉంది. అది గమనించిన ఆ రైతు వైరును సరిచేసే క్రమంలో కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద వర్గానికి చెందిన రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటీంబికుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చుస్తున్నారు.

## విద్యుత్తుషాక్‌తో స్పాట్‌లోనే వ్యక్తి మృతి

**పూడూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ప్రమాదావషత్తు విద్యుత్తుషాక్‌తో ఓవ్యక్తి అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని మేడికొండ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని మేడికొండ గ్రామానికి చెందిన కుర్వ మల్లయ్య(50) పెద్దఉమ్మెంతాల గ్రామానికి చెందిన పొలాన్ని కౌలుకు వేసుకొని పంటసాగు చేస్తున్నాడు. అయితే రోజు మాదిరిగానే గురువారం ఉదయం తనభార్య శివనీలతో కలిసి పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. అదేరోజు సాయంత్రం భారీవర్షం కురుస్తుండడంతో పక్కనే ఉన్నవాగులో నీటి ఉధృతిపెరిగింది. దీంతో వాగుదాటలేక సుమారు 7గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లేందుకు పొలంనుండి బయలుదేరిన భార్యాభర్తలు ఇద్దరు తెలుగు నారాయణ మొక్కజొన్న పొలంనుండి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే పక్కపొలం రైతు మొక్కజొన్న పంటను పందుల బెడదనుండి కాపాడేందుకు గట్టుచుట్టూ విద్యుత్తు వైర్లను ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలియని సదరు భార్యభర్తలు ఇద్దరు మొక్కజొన్న పంటపొలం మీదుగా వెళుతుండగా, ప్రమాదావషత్తు మల్లయ్యకు విద్యుత్తు వైరుతాకి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు మల్లయ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల పిర్యాదు మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్‌షాక్ గురై ఆర్టిజన్ మృతి

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు8,ప్రభాతవార్త :**
విద్యుత్ శాఖలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్న ముదిగిరి అనిల్ గురువారం రాత్రి కురుస్తున్న వర్షాలకు విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్కు గురై మృతి చెందాడు. శాఖలో 2014లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా చేరి ప్రభుత్వం ఆర్టిజన్ గా క్రమబద్ధీకరించింది. అనిల్ శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని చిన్న గోల్కొండ సంఘీగూడలో ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదును అటెంప్ట్ పనిచేస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన మల్లయ్య కుమారుడు ముదిగిరి అనిల్ విద్యుత్ శాఖ శంషాబాద్ సెక్షన్ లో ఆర్టిజన్ గా పనిచేస్తున్నాడు. అనిల్ కు భార్య రజిత, పిల్లలు తేజస్వి, శివ లు ఉన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ పి రత్నాకర్ రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ బాషా, విద్యుత్ శాఖ హెచ్ 82 యూనియన్ నాయకులు కిరణ్ కుమార్, రాజు, 1104 యూనియన్ నాయకులు శ్రీనివాస్, బాబురావు, నరేందర్ లు చేరుకుని జరిగిన సంఘటన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఉన్న అనిల్ విద్యుత్ షాక్‌తో మృతి చెందటం బాధాకరమని ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. యాజమాన్యం అనిల్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. విధి నిర్వహణలో విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.

# పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి

### -మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి



మేడ్చల్ జిల్లా పరిధిలోని జవహర్‌నగర్ పిహెచ్‌సిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8, ప్రభాతవార్త**
పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కాప్రా మండలంలోని జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగ ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌సి కేసులు ఎన్ని మిస్ అవుతున్నాయని, పరీక్షలకు రానివారిని ఏ విధంగా గుర్తిస్తున్నారని గైనకాలజిస్ట్ డాక్టర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎఎన్‌సి పరీక్షలకు రానివారిని గుర్తించి ఆశావర్కర్లు ఎఎంసిల ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని అన్నారు. సి సెక్షన్ వరకు వెళ్లకుండ ముందు జాగ్రత్తలు తీసుకునేలా పేషంట్లకు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ల్యాబరేటరీని పరిశీలించి రోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని, ఇక్కడ ఎన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ లేని పరీక్షలను ఎక్కడ చేయిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపి పేషంట్ల నమోదు రిజిస్ట్రేషన్ హిస్టరీ అప్‌డేట్ అవుతుందా అని ఆరా తీశారు. కలెక్టర్ ఈ హాస్పిటల్‌లోని అన్ని విభాగాలను తిరిగి పరిశీలించారు. అవసరమైన మరమ్మతు పనులకు ఎస్టిమేట్‌వేసి తనకు పంపాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. రోగులకు అందిస్తున్న సేవలను,, సిబ్బంది హాజరు పట్టికను, ఓపి రిజిష్టర్, డెలివరీ రిజిష్టర్స్‌ను పరిశీలించారు. పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించేందుకు వైద్యశాఖను బలోపేతం చేస్తుందని అన్నారు. సీజనల్ వ్యాదులను దృష్టిలో ఉంచుకుని వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉందని జిల్లాలోని ఆరోగ్యకేంద్రాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన, మెరుగైన వైద్య సేవలు అందించటంలో ఆదర్శంగా ఉంటున్నారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి, మెడికల్ ఆఫీసర్ సుష్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రీయ డెయిరీ పాల ఉత్పత్తులపై అవగాహన





కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అధికారులు, పాడి రైతులు

**యాచారం,ఆగస్టు8, ప్రభాతవార్త :**
యాచారం మండల పరిధిలోని గున్ గల్ గ్రామంలో శుక్రవారం పి.వి.నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, హైదరాబాద్, ఆధ్వర్యంలో శాస్త్రీయ డెయిరీ సాగు పాల ఉత్పత్తుల విలువ జోడింపు పై ఆస్ట్రేలియా రాయబారి కార్యాలయం ప్రత్యక్ష సహాయ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్యంగా గ్రామీణ మహిళలు యువతలో శాస్త్రీయ పద్ధతుల డెయిరీ సాగు అవగాహనను పెంచడం, పాల ఉత్పత్తుల విలువ జోడింపు ద్వారా ఆదాయ మార్గాలు అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. కె. కొండల్ రెడ్డి, మాజీ రిజిస్ట్రర్ పశువైద్యవిశ్వవిద్యాలయం మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం పాల పదార్థాల తయారీపై పాడి రైతులకు శిక్షణ అవగాహనా కల్పించడం ఏర్పాటు చేశారు. డా. టి రఘునందన్, ఫార్మర్ డీన్ ప్రొఫెసర్, శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా ఆధునిక డెయిరీ ఫారాలను స్థాపించడంపై సూచనలు అందించారు. పశుపోషణ, షెడ్ నిర్మాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వంటి అంశాలను వివరించారు. డా. ఎం. శశికుమార్, ప్రొఫెసర్ విభాగాధిపతి, డా. ఎం. సాహిత్య రాణి, అసోసియేట్ ప్రొఫెసర్, లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ విభాగం వారు ఖోవా, కలాకండ్, పనీర్, చన్నా, రసగుల్లా, రసమలై, బసుందీ, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, వే డ్రింక్స్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రాముఖ్యత నిచ్చారు. జి. రత్నాకర్, ప్రాజెక్ట్ మేనేజర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్, "డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత" అనే అంశంపై ప్రేరణాత్మక ప్రసంగం అందించారు. పాల ఉత్పత్తి, పశుపోషణ వంటి కార్యకలాపాల్లో మహిళల పాత్రను కొనియాడుతూ, శాస్త్రీయ పద్ధతులు, ప్రభుత్వ పథకాల వినియోగం, వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ప్రోత్సహించారు. కార్యక్రమం ముగింపులో మహిళ పాడి రైతులకు ధృవపత్రాలు పంపిణీ చేయబడినవి. ఈ శిక్షణా కార్యక్రమం రైతుల్లో కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కలిగించి, శాస్త్రీయ డెయిరీ సాగు ద్వారా ఆదాయాన్ని పెంచే దిశగా ఒక మంచి మార్గాన్ని చూపించింది. ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికారతకు ఇది ప్రేరణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంధ్య , పశు గణన సహాయకులు కృష్ణ, రైతులు శ్రీలత, అలివేలు, బోడకొండ రైతులు లచ్చిరామ్ , మరియు మహిళా పాడి రైతులు గ్రామస్తులు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కరించాలి

### -మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
### -మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



మూడిచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంను సందర్శించి తనిఖీ చేసిన మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**
భూ భారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంను ఆయన ఆకస్మికంగా సందర్శించి భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన ధరఖాస్తుల పరిష్కార దిశలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో ఇచ్చిన ధరఖాస్తులు ఎన్ని, ఎంత వరకు పరిష్కారం అయినట్లు తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ధరఖాస్తుల పరిష్కారానికి జరుగుతున్న జాప్యానికి గల కారణాలను ఆయన పరిశీలించారు. సాంకేతికరపరమైన ఇబ్బందులు ఉన్నట్లు అయితే క్లియర్ చేసుకోవాలని, ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆన్‌లైన్ మాన్యువల్‌గా పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నందిగామలో భారీ వర్షం..!

### -అలుగు పారిన అక్కమ్మ చెరువు
### -చేపల కోసం జనజాతర



నందిగామ నుండి వీర్లపల్లి వెళ్లే రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

**నందిగామ ఆగస్టు 8 ప్రభాతవార్త**
నందిగామ మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జల్లులతో ప్రారంభమైన వాన ఒక్కసారిగా కుండపోతను తలపించింది. వాగులు, వంకలు, చిన్న చిన్న గుంతలు నుండి పంట చేళ్లపై ప్రవహించాయి. పై నుండి వర్షపు నీటి ప్రవాహంతో నందిగామ నుండి వీర్లపల్లి వెళ్లే రహదారికి రాకపోకలు స్తంభించాయి. వర్షపు నీటితో అక్కమ్మ చెరువు అలుగు పారడంతో జనం సంబరాలు జరుపుకున్నారు. నీటి ప్రవాహానికి చేపలు ఎదిరిగడంతో చుట్టుపక్కల ప్రజలు చేపల వేటకు దిగడంతో జన జాతరను తలపించింది. అరకిలో నుండి సుమారు 12 కిలోల దాక చేపలు దొరకడంతో భోజన ప్రియుల ఆనందం అవధులు దాటింది.

## కెటిఆర్‌కి రాఖీ కట్టిన లగచర్ల మహిళా రైతులు..



కెటిఆర్‌కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న లగచర్ల మహిళా రైతులు

**దుద్యాల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మండల పరిధిలో ఏర్పాటు చేయ నున్న పారిశ్రామిక వాడ భూసేకరణలో బాధిత గిరిజన తండాల మహిళా రైతులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిలకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పులిచెర్లకుంట తండా కు చెందిన జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వం మా భూములు గుంజుకొని నా భర్త ను జైలుకు పంపి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తే కేటీఆర్ మాకు అన్న లాగ అండగా నిలబడ్డాడు అని అన్నారు. నిండు గర్భిణిగా ఉన్న నా క్షేమాలన్ని చూసుకున్నాడు. నా బిడ్డకు మేనమామ లాగ భూమి నాయక్ అని పేరు పెట్టాడని, కేటీఆర్ నాకు దేవుడు ఇచ్చిన అన్న అని అన్నారు. కార్యక్రమంలో గిరిజన మహిళ రైతులతోపాటు కోట్ల మహిపాల్, లగచర్ల సురేష్, మాజీ సర్పంచ్ అనిత సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

### -తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి
### -ఇంటి పన్ను 2,92,156రూపాయలు ఒకేసారి చెల్లింపు అభినందనీయం



.దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి ఇంటిపన్నును చెల్లించిన దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**
ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి కోరారు. మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి తమ ఇంటి పన్ను 2,92,156రూపాయలు ఒకేసారి చెల్లించటం జరిగిందని అభినందనీయమని ఆమె అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి మున్సిపల్ బిల్‌కలెక్టర్ రాంరెడ్డికి ఇంటిపన్నును అందజేశారు. అదే విధంగా మున్సిపాల్టీలోని అన్ని వార్డుల ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి సూచించారు.

## జిల్లాలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

-భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న సంతోషిమాత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక పట్టణాలతోపాటు గ్రామీణప్రాంతాలలో శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మీవ్రతాలు భక్తిశ్రద్ధలతో వైభవంగానిర్వహించారు. జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి, పొట్లపల్లి శివలయం, నాచారం లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంతోపాటు సిద్దిపేట పట్టణంలోని సంతోషిమాత, వేంకటేశ్వర, శరభేశ్వర, కోటిలింగాల, రేణుకాఎల్లమ్మ, షిర్డి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సంతోషిమాత అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యహోమంలో భాగంగా సర్వదోష నివారణకోసం హోమం, అమ్మవారికి ఉద్యాపన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీచైర్మన్ డాక్టర్ మాంకాల నవీన్ కుమార్, కార్యనిర్వహణాధికారి శ్రీధర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు తమ్మిశెట్టి వీరేశం, బచ్చు రమేష్, కాచం కాశీనాథ్, గందె ఎల్లేశం, అర్చకులు రామకృష్ణ, మధుసూదన్‌శర్మ, మాజీ ధర్మకర్తలు సత్యంగౌడ్, రాము, సంతోష్, నాగరాజు, ప్రభాకర్, సువర్ణ, భక్తులు వాణి, పద్మ, ఆలయ సిబ్బంది శంకర్, వాసు, శ్రీనివాస్, సేవకులు హరి, వేణు, నరసింహ, సంతోషిమాత సేవాసమితి సభ్యులు, సంతోషిమాత మాతృమండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌తోనే అభివృద్ధి

-సిద్దిపేట పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అత్తు



అజ్మీర్‌లో చాదర్‌ను సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రజల అకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సర్కార్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. మరో 10 యేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ అజ్మీర్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని దశలవారీగా అమలుచేస్తూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. మహిళల అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ విమర్శలు చేస్తుందన్నారు. బిసి బిల్లును కేంద్ర సర్కారు అడ్డుకోవడం సరికాదని, కాంగ్రెస్ సర్కారు బిల్లును సాధించి తీరుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి హర్షద్ తదితరులు ఉన్నారు.

## నర్సారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలి

-దళిత మహిళల డిమాండ్

**కొండపాక, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ సంఘటనలో మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని శుక్రవారం కొండపాక మండలకేంద్రంలో దళిత మహిళలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నర్సారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షపాతి అనుకున్నామన్నారు. దళితులు గెలిపించుకున్న కాంగ్రెస్ పార్టీలో దళితులకే రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. నర్సారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి కాంగ్రెస్ అధిష్ఠానం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్‌చేశారు. నర్సారెడ్డికి వ్యతిరేకంగా విజయ్‌కుమార్‌కు అనుకూలంగా ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో నినాదాలు చేశారు. నర్సారెడ్డిని అరెస్ట్ చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో లచ్చవ్వ, అంజలి, నాగవ్వ, లక్ష్మి, రంగవ్వ, యాదవ్వ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో ఘనంగా వరలక్ష్మీవ్రతాలు



ప్రత్యేక పూజలందుకున్న వరలక్ష్మీమాత

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
అతి పవిత్రమైన శ్రావణమాసంలో మూడవ శుక్రవారం పురస్కరించుకొని నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలో ప్రతిఇంట వరలక్ష్మీవ్రతాలను భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు ఉదయాన్నే స్నాన సంధ్యాది కృత్యాలను తీర్చుకొని కొత్తబట్టలు ధరించి వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు ఒకరికొకరు పసుపు కుంకుమ తాంబూలాలను ఇచ్చిపుచ్చుకుంటూ వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## వెల్దుర్తిలో ఘనంగా వరలక్ష్మీవ్రతాలు



వరలక్ష్మీవ్రతం సందర్భంగా పూజలందుకున్న వరలక్ష్మీమాత

**వెల్దుర్తి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెలుగుతోపాటు పలుగ్రామాల్లో మహిళలు ప్రతి ఏడు వచ్చే శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే వరలక్ష్మీవ్రతాలను చేసుకోవడంద్వారా మంచి జరుగుతుందని ఆలోచనతో మహిళలు వరలక్ష్మి అమ్మవారిని ఏర్పాటుచేసి అమ్మవారికి అలంకరణ నిర్వహించి పువ్వులు పళ్లతోపాటు ఫలహారాలు సమర్పించారు. దీంతో తోటి మహిళలకు సైతం వాయినాలను సమర్పిస్తూ వారి మొక్కలను తీర్చుకుంటున్నారు.

# తనకు రాజకీయ ఓనమాలు నేర్పింది దళితులే

-ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు శివులు నివాసంలో అల్పాహారం చేసిన నర్సారెడ్డి



ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శివులు నివాసంలో అల్పాహారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, నర్సారెడ్డి

**గజ్వేల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
తనకు రాజకీయ ఓనమాలు నేర్పించింది దళితులే అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్‌లోని ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు ఈదుగాని శివులు నివాసంలో కార్యకర్తలతోకలిసి అల్పాహారంచేశారు. ఈసందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ తనను కొందరు దళితవ్యతిరేకిగా పనిగట్టుకొని ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. తన రాజకీయ జీవితం వర్గల్ మండలకేంద్రంలోని దళిత వాడలోనే ప్రారంభమైనట్లు గుర్తుచేశారు. తనకు వారు రాజకీయ ఓనమాలు నేర్పించారని, తనను కడుపులోపెట్టుకొని కాపాడుకున్నట్లు స్పష్టం చేశారు. వర్గల్ సర్పంచ్‌గా తన రాజకీయ జీవితం ప్రారంభించి ఎమ్మెల్యేగా అంచెలంచెలుగా ఎదిగిన నాకు దళితులే తోడు ఉన్నారన్నారు. వర్గల్‌లో తన చిన్నప్పటి నుండి 40 దళిత కుటుంబాలు అండగా ఉంటూ రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పాటునందించారన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదగడానికి గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు అన్ని విధాలుగా సహకరించారని, నేను ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు ఎవరిపై చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీలో భాగంగా దళితుల ఇళ్లలో సహపంక్తి భోజనాలు చేసినట్లు స్పష్టంచేశారు. రాజకీయ ఎదుగుదలతో విమర్శలు సహజమని, అయితే అందులో ఎంతో కొంత నిజం ఉండాలన్నారు. రాజకీయాల్లో ఆటుపోట్లు, కష్టసుఖాలు సహజమని, తనపై వచ్చిన అపవాదు తొలగించుకోవడం తన బాధ్యత అని అన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మాజీ ఎంపిపి మోహన్, ఎఎంసి డైరెక్టర్లు అక్కారం యాదగిరి, డాక్టర్ వాహిద్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, బెజుగామ శివారెడ్డి, కొండ పోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, శ్రావణ్, మన్నె అరుణ్‌కుమార్, 3వవార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెర్క నాగరాజు, నక్క రేగొండ, మైనార్టీ జిల్లా నాయకుడు అజ్గర్, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, సొక్కం సురేష్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

-ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

**బెజ్జంకి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలపరిధిలోని ముత్తన్నపేట గ్రామంలో శుక్రవారం రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 50మంది లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్‌చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడివో కడవెర్గు ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బైర సంతోష్, అక్కరవేణి పోచయ్య, గూడెల్లి శ్రీకాంత్, శానగొండ శరత్, మిట్టపల్లి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల పడిగాపులు

-క్యూలో చెప్పులు పెట్టిన రైతులు



యూరియా కోసం క్యూలైన్ కట్టి చెప్పులు పెట్టిన రైతులు

**నంగునూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతులకు యూరియా కోసం తిప్పలు మాత్రం తప్పడం లేదు. మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో శుక్రవారం రైతులు యూరియా కోసం పిఎసిఎస్ వద్ద ఉదయం నుంచి క్యూలైన్‌లో నిలబడడంతోపాటు మరి కొంతమంది రైతులు చెప్పులను క్యూలైన్‌లో పెట్టి యూరియా కోసం వేచి చూశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఒక ఎకరానికి ఒక యూరియా బస్తా ఇవ్వడంతో రైతులు భారీగా యూరియా కోసం లైన్‌లో బారులు తీరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తగుచొరవ తీసుకొని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

## బిసి బిల్లుకు ఆమోదం తెలపకుంటే బిజెపి బిసిల వ్యతిరేకులుగా మిగులుతుంది

-మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు శివప్ప

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ సర్కారు బిసిలకు 42శాతం రిజర్వేషన్లను సాధించి తీరుతుందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప అన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అడ్డు తగులుతున్నాయని మండిపడ్డారు. 10శాతం ముస్లింలకు రిజర్వేషన్లు తీసివేయాలని బిజెపినాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని బిసిలలో అన్నివర్గాలకు న్యాయం చేయడానికి సర్కారు 42శాతం రిజర్వేషన్ల బిల్లు తెస్తే ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు పోతాయని బిజెపి నాయకులు మాట్లాడడం అర్థంపర్థం లేదన్నారు. ప్రధాని మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే బిసి వ్యతిరేకులుగా మిగిలిపోతారని తెలిపారు. కేంద్ర సర్కారు వెంటనే బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు ఆమోదముద్ర వేయాలన్నారు. అనంతరం జహీరాబాద్ ఎపి సురేష్‌షెట్కార్ జన్మదిన వేడుకలను శివప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదకుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ఎంతో మేలు

-ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
ప్రతి పేదకుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌పట్టణ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గంలోని పలు మండలాలకుచెందిన బాధిత కుటుంబసభ్యులకు రూ.3,03500/ సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్న ప్రతి పేద కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ఎంతో మేలు జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో పట్టణ బల్దియా మాజీ ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్, నాయకులు కవితఅమర్‌సింగ్, సత్యంగౌడ్, షేక్‌హుస్సేన్, మద్దెల జనార్ధన్, మధుకర్‌రెడ్డి, చిరివేళ్ళ ప్రసాద్, బొడ్ల నవీన్‌గుప్త, ఎల్లమయ్య, గుంజరి ప్రవీణ్‌కుమార్, సింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్రి మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, అశోక్‌రెడ్డి, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

-యూరియా ఎరువులు అందుబాటులో ఉంది
-వ్యవసాయశాఖ ఎడిఎ సంధ్యారాణి, ఎవో దీపిక

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
రైతులకు ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువుల కృత్రిమకొరతను సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఎడిఎ సంధ్యారాణి హెచ్చరించారు. గురువారం నర్సాపూర్‌మండలంలో, పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఎడిఎ సంధ్యారాణి, ఎవో దీపికతో కలిసి సందర్శించి తనిఖీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులకుసరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈమేరకు ఎవరైనా దుకాణదారులు ఎరువులను కృత్రిమకొరత సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాక రైతులు నానోయూరియాను వాడటం మంచిదని తెలిపారు. నానోయూరియా వల్ల నైట్రోజన్ వినియోగ సామర్థ్యం పెరుగుతుందని అధిక దిగుబడి నాణ్యత పెరుగుతుందని, సంప్రదాయ యూరియాపై ఆధారాన్నితగ్గించడం ద్వారా ఖర్చు తగ్గుతుందని, మట్టినీటి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుతుండటం వంటి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. ఈమేరకు నానోయూరియా ఎరువులను ప్రతి పంట సీజన్లో రెండుసార్లు వాడాలన్నారు. ఒకలీటర్ నీటికి రెండో 4మీమీ లీటరు వేయాలన్నారు. విత్తనం వేసిన 25 రోజుల నుండి 30రోజులు తర్వాత పుష్పించే దశలో స్ప్రేచేయాలన్నారు. ఈమేరకు రైతులందరూ నానోయూరియాను వినియోగించి అధిక లాభాలు పొందాలని ఎడిఎ సూచించారు.

# రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘాలు

-పిఎసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న పిఎసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి, తదితరులు

**వెల్దుర్తి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక సహకార సంఘంలో శుక్రవారం అర్ధమాస వార్షిక ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ సిఈవో అశోక్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన పద్ధతులను అభివృద్ధి గూర్చి చదివి వినిపించారు. అనంతరం అనంత రెడ్డి మాట్లాడుతూ రైతులు అభివృద్ధి కోసమే సహకార సంఘాలు ఉండడం జరిగిందని అందులో భాగంగానే సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, అలాగే రుణాలను అందించడం జరుగుతుందన్నారు. పిఎసిఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎన్నో కార్యక్రమాలను సహకార సంఘాల ద్వారా నిర్వహించడం జరుగుతుందని అందుకు రైతులు సహాయసహకారాలు అందించాలన్నారు. రైతులకు కావలసిన రుణాలను సకాలంలో పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. రైతులు సహకార సంఘాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ మురళి, డైరెక్టర్లు కృష్ణగౌడ్, రమేష్‌చందర్‌గుప్తా, నర్సింలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాములపర్తిలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

**మర్కుక్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పాములపర్తిగ్రామంలో దుర్గామాతకు ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందజేశారు. ఈసందర్భంగా మేకల కనకయ్య మాట్లాడుతూ ప్రతినెలా వచ్చే పౌర్ణమికి దుర్గామాతకు ప్రత్యేకపూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో అనూప్‌కు సన్మానం

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాడిపల్లి అనూప్‌ను శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గాడిపల్లి అనూప్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతపదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, హనుమాండ్ల నాగరాజు, గుండు మల్లేశం, శేర్ల నర్సింలు, ఏడెల్లి విష్ణువర్ధన్, పెందం వెంకటేష్, వడ్డేపల్లి రమేష్, మెరుగు శ్రీనివాస్, దొంతుల ప్రసాద్, మసన భాస్కర్, పెందం కృష్ణ, దేవసాని హనుమాన్‌దాస్, చిలివేరి వెంకటేష్, బత్తిని నరేష్, శేర్ల సుధాకర్, దేవసాని వాసుదేవ్, ఏడెల్లి మహేందర్ పాల్గొన్నారు.

## చేనేత విగ్రహావిష్కరణను విజయవంతం చేసిన అతిథులకు కృతజ్ఞతలు

**గజ్వేల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో చేనేత మగ్గం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారాం, యువజన విభాగం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా చేనేత మగ్గం విగ్రహ ఆవిష్కరణనిర్వహించి విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన పద్మశాలిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బూర మల్లేశం, పద్మశాలిసంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్‌తోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితోపాటు పద్మశాలిసంఘం నాయకులకు, కులబాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సిఐటియు గెలుపుపై హర్షం



సమావేశంలోమాట్లాడుతున్న సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి

**గజ్వేల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోగల కిర్బీ పరిశ్రమలో జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో 14ఓట్ల మెజార్టీతో బిఆర్‌టియు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుపై సిఐటియు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ఘనవిజయం సాధించినట్లు సిద్దిపేట జిల్లా సిఐటియు అధ్యక్ష, ఉపాధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కిర్బీ పరిశ్రమలో 578 కార్మికులు ఉండగా 576మందికార్మికులు ఓటుహక్కువినియోగించుకున్నారని, సిఐటియుకు 295రాగా, బిఆర్‌టియు యూనియన్‌కు 281ఓట్లు వచ్చాయని, 14ఓట్ల మెజార్టీతో సిఐటియు యూనియన్ గెలుపొందినట్లు తెలిపారు. కార్మికుల చట్టాల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిఐటియు పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్మికవర్గం సిఐటియుతో అండగా ఉండి హక్కులు సాధించుకోవడానికి కలిసిరావాలని విజ్ఞప్తిచేశారు.

## దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు సరైనవికావు

-దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**దుబ్బాక, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. దుబ్బాకలో సిఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్లకు డబ్బులుపంచి గెలిచిన, అహంకారంతో కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. డబ్బుందనే అహంకారంతో కలెక్టర్లపై, దళిత మంత్రులపై ఇష్టానుసారంగా, మతిభ్రమించినట్లు కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సత్యం రామలింగ రాజు, కాళేశ్వరంప్రాజెక్టులో అవినీతిసొమ్మును కూడబెట్టుకున్న ప్రభాకర్ రెడ్డి నేడు విమర్శలుచేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితోకలిసి అధికారులపై జులుం ప్రదర్శించడం సరైందికాదన్నారు. పదవికి వన్నెతెచ్చేవిధంగా బక్కి వెంకటయ్య నడుచుకోవాలని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చైతన్యపురికాలనీలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలోని తొమ్మిదోవార్డు చైతన్యపురికాలనీలో శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్‌తోపాటు అధికారులు సీజనల్‌వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100రోజుల కార్యక్రమంలోభాగంగా మున్సిపాలిటీపరిధిలోని తొమ్మిదవ వార్డు చైతన్యపురి కాలనీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇతర సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్‌తోపాటు వార్డు అధికారులు ఉదయ్‌కుమార్, మల్లేష్, రాములు, రణదీప్, మెప్మా ఆర్పీలు జవాన్లు, ఎల్లయ్య, అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

-గజ్వేల్ సిఐ రవికుమార్



రాఖీ దుకాణదారులతో మాట్లాడుతున్న సిఐ రవికుమార్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
రాఖీపండుగ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో, దుకాణాలముందు రాఖీసెంటర్లను ఏర్పాటుచేయగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతుండడంతో గజ్వేల్ సిఐ రవికుమార్ శుక్రవారం ఎస్ఐలు రఘుపతి, యాదగిరిరెడ్డి, పోలీసుసిబ్బందితోకలిసి దుకాణ యజమానులకు పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ రాఖీసెంటర్లను రోడ్డుపైవరకుపెట్టడంతో ప్రజలకు,వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దుకాణదారులు వారిదుకాణ స్థలంలో మాత్రమే పెట్టుకోవాలని అన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారస్థులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అధిక వర్షాలకు కూలిన ఇల్లు



**కేశంపేట ఆగస్టు 8 ప్రభాతవార్త :**
అధిక వర్షాల దృశ్యం కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామం లో గ్రామానికి చెందిన వెంకటమ్మ ఇల్లు కూలినట్లు గుర్తించామని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు.విపత్తుల దృశ మండల పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి

**తలకొండపల్లి ఆగస్టు8, ప్రభాతవార్త**
తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చ పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు బొళ్ళ యాదగిరి అధ్యక్షతన జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన జన్మదిన సందర్భంగా పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మాజీ మండల అధ్యక్షులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు బొల్లయాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పేదల ఆకలి తీర్చేందుకు పండుగ సాయన్న పోరాటం వెలకట్టలేనిదని ఆయన అన్నారు. పేదోడి కడుపు నింపేందుకు భూసాములను, పెత్తందారులను ఎదిరించి పేదల కడుపు నింపిన మహనీయుడు పండుగ సాయన్న అని వారు అన్నారు. పండుగ సాయన్న అడుగుజాడల్లో నడుస్తూ ముదిరాజులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ మాజీ అధ్యక్షుడు నూకం ముదిరాజ్, పద్మ దశరథ ముదిరాజ్, రామచంద్రయ్య, నరేష్ ,శేఖర్, ఉపసమోని నరసింహ, ఇంద్రయ్య, శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

**..బిఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి**




మాట్లాడుతున్న పంజుగుల శ్రీశైల్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కు నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని బిఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఫైలెట్ రోహిత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలోనిర్వహించిన పెద్దేముల్ మండల బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసం క్షేమం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ను ప్రజలకు గుర్తుచేయాలని అన్నారు. బిఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధిపనులను వివరించే భాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, సంక్షేమ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేస్తే అంతిమ విజయం తమదేనని అన్నారు.ఫైలెట్ రోహిత్‌రెడ్డి అధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ బిఆర్ఎస్ ప్రభుత్వంరావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు రమేష్, పి,గోపాల్‌రెడ్డి, మహేందర్, అంజయ్య,రాములు, జనార్ధన్‌రెడ్డి,నరేష్‌రెడ్డి, శిల్పి, సాకలి రంగయ్య, డివై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రతాలు..పూజలు



.శామీర్‌పేటలో శ్రావణమాసం సందర్భంగా వరలక్ష్మి వ్రతం పూజలు జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**
శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మి పండుగను పురస్కరించుకుని శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు ఘనంగా వరలక్ష్మి వ్రతాలు, పూజలు చేశారు. శుక్రవారం శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల్లో, తూంకుంట మున్సిపాల్టీలోనూ వివిధ గ్రామాల్లో ప్రజలు ప్రత్యేకంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలు, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ప్రతి ఇంటా వరలక్ష్మి పూజలు చేసి అందరు క్షేమంగా ఉండాలని మొక్కుకుని పూజలు చేశారు. పలువురు ఇళ్లలో వరలక్ష్మి పూజలు చేసి తోటి మహిళలను ఆహ్వానించి పసుపు,బొట్టులను అందజేశారు. శ్రావణమాసంలో ఈ శుక్రవారంకు ప్రత్యేకత ఉండి శ్రీవరలక్ష్మి పూజలు చేయటం జరిగింది. మహిళలు భక్తి శ్రద్దలతో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శామీర్‌పేటలోని డాక్టర్ రమేశ్‌గౌడ్ నివాసంలో శ్రావణమాసంను పురస్కరించుకుని శుక్రవారం వరలక్ష్మి వ్రతంను నిర్వహించి పూజలు చేశారు.దీనిలో వారితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో, తూంకుంట మున్సిపాల్టీలోనూ వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి పండుగను ఘనంగా జరుపుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకం వైఎస్‌ఆర్‌కు అందజేత



సుదర్శన్‌రెడ్డికి ఆత్మకథ పుస్తకాన్ని అందజేస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ

**ఘట్‌కేసర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ఆత్మకథ పుస్తకాన్ని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి-బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డికి అందజేశారు. దత్తాత్రేయ గవర్నర్‌గా పదవీ విరమణ చేసిన సందర్భం గా శుక్రవారం సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దత్తాత్రేయ తన ఆత్మకథను పుస్తక రూపంలో నిక్షిప్తం చేసిన 'ప్రజల కథే నాఆత్మ' పుస్తకాన్ని సుదర్శ న్‌రెడ్డికి బహుకరించారు. బిజెపి తెలంగాణ రాష్ట్రంలో సిద్దాంత, నిబద్ద తతో నిరంతరం దేశ సేవ, సమాజ సేవలో తలమునకలై పార్టీలకు అతీతంగా ఆజాత శత్రువుగా దత్తాత్రేయ ఆధర్శనేతగా నిలిచారని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

**ఆమనగల్లు, ఆగస్టు8, ప్రభాతవార్త:**
శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని భక్తులు శ్రీవరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్దల మధ్య అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది లాగే ఈఏడాది పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరం, శ్రీ కన్యకపరమేశ్వరి ఆలయం లో పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి శ్రీవరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. శ్రీవరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్నాయి. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో సత్యసాయి మందిరంకు చేరుకుని శ్రీవరలక్ష్మి వ్రతంలో పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన కార్యక్రమంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారి నామస్మరణ మారుమ్రోగిపోయింది. శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీను ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో జరిగిన శ్రీవరలక్ష్మి వ్రతం పూజలకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సామూహిక వ్రతాలు చేపట్టారు. పూజలనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దొంతు పుల్లయ్య, దొంతు విశ్వనాథం, ఆమనగంటి సంజీవ్‌కుమార్, నాగిళ్ళ లింగం, కృష్ణారెడ్డి, గుర్రం సురేష్, రాము గోల్డు, ఎన్ఆర్ ప్రభాకర్, రాధాకృష్ణమూర్తి, పోలిశెట్టి శ్రీను, నాగిళ్ళ శంకర్, పల్లె అల్లాజీగౌడ్, దాస శ్రీను, శ్రీధర్ ,నారాయణసాగర్, పాపిశెట్టి రాము, దొంతు సంధ్య, శైలజగౌడ్, సైదులుగౌడ్, అలివేలు, అనిత, దొంతు విజయలక్ష్మి, దాస అరుణ, జ్యోతి, సింధు, అలాగే శ్రీకన్యకపరమేశ్వరి ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ అధ్యక్షతన శ్రీవరలక్ష్మి వ్రతం కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వాసవిమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక వ్రతాలు నిర్వహించారు.



సత్యసాయి మందిరంలో వ్రత పూజలు చేస్తున్న మహిళలు

# ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తాం

**-తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి**
**-చెత్తవేసిన వ్యక్తికి రూ.5వేలు జరిమానా విధింపు**

**శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**
బహిరంగ ప్రదేశంలో (ఖాళీ స్థలంలో) చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తున్నట్లు తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి స్పష్టం చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించి ఖాళీ స్థలంలో చెత్తను వేస్తున్న వ్యక్తిని పట్టుకుని 5వేల రూపాయల జరిమానా విధించటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ జ్యోతి పేర్కొన్నారు. మున్సిపల్ వార్డుల ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా స్వచ్ఛ ఆటోలకు వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసినా, చెరువుల్లోనూ వేసినా వేసిన వారిని గుర్తించి జరిమానాలు విధించటం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. గతంలోనూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసిన వారికి జరిమానాలు విధించామని ఆమె గుర్తు చేశారు. మున్సిపల్‌లోని వివిధ వార్డులలో అధికారులు, సిబ్బంది పర్యటించటం జరుగుతుందని ఆమె అన్నారు. నిబంధనలకు విరుద్దంగా వ్యవరించే వారిని వదిలే ప్రసక్తి లేదని కమిషనర్ జ్యోతి స్పష్టం చేశారు.



తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో ఖాళీ స్థలంలో ట్రాక్టర్‌లో తెచ్చి అక్రమంగా చెత్తను వేస్తున్న దృశ్యం

# ఘట్‌కేసర్‌లో ఘనంగా వరలక్ష్మివ్రతం

**ఘట్‌కేసర్, ఆగష్టు 8, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రత పూజలు భక్తి, శ్రద్దలతో నిర్వహించారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వివాహిత స్త్రీలు ఈవ్రతాన్ని ఆచరిస్తారు. ఘట్‌కేసర్, శివారెడిగూడ, ఎన్ఎఫ్‌సీనగర్, కొండాపూర్, ఘణాపూర్, ఎదులాబాద్, అవుషాపూర్, అంకుశాపూర్ తదితర చోట్ల వరలక్ష్మితల్లికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు ఉపవాసం ఉండి లక్ష్మీదేవిని పూజించి వరలక్ష్మీవ్రత కథను చదవడం, వినడం చేశారు. తమ భర్తల ఆరోగ్యం, దీర్ఘాయువు, కుటుంబసభ్యులందరికీ సంపద, శ్రేయస్సు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. పలువురు మహిళలు దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకోగా కొందరు తమ ఇళ్లలో మామిడి తోరణాలు, పూలు ఏర్పాటు చేసి లక్ష్మీదేవి ప్రతిమను ప్రతిష్టించి పూలతో అలంకరించారు. అర్చకుల మంత్రోచ్చారణాలతో కలశస్థాపన చేసి, షోడశోపచార పూజలు చేసి లక్ష్మీమంత్రాలను జపించారు. అమ్మవారికి పండ్లు, వివిధ రకాల నైవేధ్యాలు తయారు చేసి సమర్పించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్ దత్తాత్రేయ నగర్‌లో మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి తన గృహంలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తితో ఆచరించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి చుట్టూ ప్రదక్షిణలు చేసి హరతి ఇచ్చి పూజలు చేశారు. ఈవ్రతం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం లభించి, జీవితంలో సుఖశాంతులు కల్గుతాయని అర్చకులు తెలిపారు.



.వరలక్ష్మి వ్రత పూజలో మాజీ కౌన్సిలర్ సంగీతాప్రభాకర్‌రెడ్డి

# నేడు రక్షాబంధన్..కొనుగోళ్లతో మార్కెట్ కిటకిట

**-జాతీయ రహదారిపై వాహనాల రద్దీ**

**ఘట్‌కేసర్, ఆగష్టు 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో వరుస పండుగలతో దుకాణాలన్ని కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం, రాఖీపౌర్ణమి సందర్భంగా పట్టణంలో మార్కెట్ కిటకిటలాడింది. రాఖీ, మిఠాయి, పూజాసామాగ్రీ, పూలు, పండ్ల అమ్మకాలు జోరుగా జరిగాయి. వ్యాపారులు పూలు, పండ్ల ధరలను పెంచి విక్రయాలు చేస్తున్నారు. మార్కెట్‌లో సందడి చేస్తున్న వివిధ రకాల రాఖీలను మహిళలు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. పట్టణంలో రోడ్డుపైనే అమ్మకాలు చేస్తుండటంతో వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ ఆటంకం కల్గుతున్నది. శనివారం రక్షాబంధన్ కావడంతో ఒక రోజు ముందుగానే మహిళలు మార్కెట్‌కు వచ్చి రాఖీలు, మిఠాయిలు కొనుగోలు చేశారు. అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్ల అనురాగం, అప్యాయతకు ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాఖీ పండుగకు మహిళలు తమ తోబుట్టుల ఇళ్లకు వెళ్లి రాఖీలు కట్టేందుకు ప్రయాణాలు మొదలుపెట్టారు. రైలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలలో రద్దీ నెలకొంది. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్, బస్‌టెర్మినల్, బైపాస్ రహదారి వద్ద బస్‌స్టాప్‌లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. విద్యాసంస్థలకు, కార్యాలయాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో జనాలు తమ సొంతస్థలాలకు వెళ్తున్నారు. హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ గంట గంటకు విపరీతంగా పెరుగుతున్నది.



ఘట్‌కేసర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

# నాటిన మొక్కకు క్రమం తప్పకుండా నీరు పోయాలి

**-వన మహోత్సవంలో విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచన**

**అత్తాపూర్ ఆగస్టు8,ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి తాను నాటిన మొక్కకు ప్రతి రోజు క్రమ పద్దతిలో నీరు పోసి పెంచాలని రాజేంద్రనగర్ శాసన సభ్యుడు కోరారు. నేడు మీరు నాటే చిన్న మొక్కనే రేపటికి మహా వృక్షమై సమాజానికి ఫలాలను, ఆక్సిన్ను అందిస్తుందన్న సత్యాన్ని విద్యార్థులంకా గ్రహించాలని చెప్పారు. శుక్రవారం కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలో గల ఆదిత్య హైస్కూల్లో నిర్వహించిన ఖివన మహోత్సవంఖిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడేది పచ్చదనమే అన్నారు. అడవులు వృద్ధి చెందితే ప్రకృతి రమణీయత ఉట్టిపడుతుందని, బస్తీలు, కాలనీలో చెట్లు పెరిగితే వాయు కాలుష్యాల భారీ నుంచి మనిషిని రక్షింస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి బోజనం ఏలా చేస్తారో నాటి మొక్కకు కూడా రెండు పూటల నీటి అందించాలని చెప్పారు. మీరు నీళ్లు సేవిస్తారు కాదా..? మరి మొక్కకు మీ వంతుగా ప్రతి రోజు నీళ్లు పోస్తారా..? అని ఆయన విద్యార్థులను అడిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాఠశాల చైర్మన్ ఉస్కెమూరి నిరంజన్, కరస్పాండెంట్ సంకూరి జయప్రకాష్, డైరెక్టర్లు అనితా రామకృష్ణ, వి. శిరీష, ప్రిన్సిపల్ ఎనగాండ్ల కృష్ణారెడ్డి తదితరులతో కలసి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రాంతాల పెద్దలు ఎద్దుల మాదవరెడ్డి, సుధాకర్ గౌడ్, కళ్లెం అంజయ్య, ఎస్. స్వామి గౌడ్, అంజనీగౌడ్, మైలార్దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనంజయ్, బిఆర్ఎస్ నాయకుడు కొంపల్లి జగదీష్, స్థానికులు గోపాల్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.



# నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**-హుస్నాబాద్ ఎసిపి సదానందం**

**కోహెడ, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
ప్రజలను నేరుగా కలిసి సమస్యలను తెలుసుకోవడానికే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం(కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించడం జరుగుతుందని హుస్నాబాద్ ఎసిపి సదానందం అన్నారు. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జ్యోతిరామ్‌నాయక్ తండాలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతా భావం కలిగించడానికి ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు చట్టాలు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. నూతనచట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని కాగితాలతో పాటు లైసెన్స్, బీమా సౌకర్యం కలిగి ఉండాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమా లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాల న్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1930 లేదా డయల్ 100 కాల్ చేయాలన్నారు. ఈసందర్భంగా ఎలాంటి పేపర్లులేని 22 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హుస్నా బాద్ సిఐ శ్రీనివాస్, కోహెడ ఎస్ఐ అభిలాష్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కానిస్టేబుల్ సుధాకర్‌కు బంగారు పతకాలు

**శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**
ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన సైబరాబాద్ పోలీస్ కానిస్టేబుల్ వల్లపు సుదాకర్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని రెండు బంగారు పతకాలను సాధించటంతో శామీర్‌పేట ఎస్ఐ శశివర్దన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచులు కె.రవీందర్, వి.లక్ష్మినారాయణ,పలువురు నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించి సత్కరించారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో కానిస్టేబుల్ వల్లపు సుధాకర్ బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొని రెండు బంగారు పతకాలను సాధించారు. వల్లపు సుధాకర్ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఆ తరువాత మధ్యలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ డిగ్రీ పూర్తి చేశారని, ఇంటర్ నుంచే కరాటే, క్రికెట్ కోచింగ్ తీసుకుని కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించినట్లు వారు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో పోలీసు వ్యవస్థలో చేరి డ్యూటీతో పాటు జీవిఆర్ కరాటే అకాడమీ తరపున జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలను సాధించారు. కానిస్టేబుల్‌గా రాణిస్తూ వల్లపు సుధాకర్ కరాటేలోనూ ప్రత్యేకంగా గుర్తింపు పొంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనటం విజయం సాధించి రెండు బంగారు పతకాలను సాధించటం పట్ల ఉప్పరిపల్లి గ్రామస్థులు వారితో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని గ్రామానికి మంచి గుర్తింపును తెచ్చారని ఆయనను గ్రామ పెద్దలు,గ్రామ నాయకులు పలువురు అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగులు



లింగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు చౌకట్‌పూజలో పాల్గొన్న మహేశ్‌గౌడ్

**ఘట్‌కేసర్, ఆగష్టు 8, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో ఇళ్లు లేని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాయని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఘనాపూర్ లింగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారు గుంటి నాగమణి ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతుండగా శ్రావణ శుక్రవారం ఇంటి చౌకట్ ఏర్పాటు పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటి పనులను పరిశీలించి వివరాలు తెలుసుకొని పూజలో పాల్గొన్న మహేశ్‌గౌడ్‌తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులను లబ్దిదారులు శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం భాగంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అధికారులు ఘనాపూర్‌ను ఫైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలను చేపడుతున్నారని మహేశ్‌గౌడ్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా లబ్దిదారులకు దశలవారిగా ప్రభుత్వం రూ. 5 లక్షలను ఖాతాల్లో జమచేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు గుర్జకుంట నర్సింహ్మా, బర్ల అనిత, నానావత్ సురేశ్‌నాయక్, స్థానికులు మీసాల శ్రీను, హేమలత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు



మేడ్చల్‌లోని మెడినోవా ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలను ప్రారంభించిన మెడిసిటీ సీఈఓ ఇనిష్ మర్చంట్

**మేడ్చల్, ఆగస్టు 8. ప్రభాతవార్త :** మేడ్చల్ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని మెడిసిటీ సీఈఓ ఇనిష్ మర్చంట్ అన్నారు. మెడిసిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ తమ అనుబంధ సంస్థ అయిన మేడ్చల్ పట్టణంలోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నూతన సేవలను శుక్రవారం సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ చికిత్సల కోసం హైదరాబాద్ నగరానికి వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించేలా మేడ్చల్‌లోనే కొత్త సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అడ్వాన్స్డ్ క్యాథ్ ల్యాబ్‌తో కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, వాస్కులర్ సర్జరీ వంటి అన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు మేడ్చల్‌లోనే లభిస్తాయని తెలిపారు. జాతీయ వాస్కులర్ డే సందర్భంగా, మేడ్చల్ పట్టణంలో మొట్టమొదటిసారిగా వాస్కులర్ సర్జరీ విభాగాన్ని ప్రారంభిమన్నారు. ఈ విభాగం ద్వారా డయాబెటిక్ ఫుట్ గ్యాంగ్రీన్, వరికోస్ వెయిన్స్, కిడ్నీ డయాలిసిస్ ఫిస్టులా సర్జరీలు వంటివాటికి అత్యాధునిక చికిత్సలు అందిస్తామని పేర్కొన్నారు. డయాబెటిక్ రోగుల కాళ్లు తొలగించాల్సిన అవసరం లేకుండా రక్తప్రసరణను మెరుగుపరిచే చికిత్సలు చేస్తామని, అదే విధంగా బ్రెయిన్ స్ట్రోక్ పునరావృత్తిని నివారించడానికి క్యారొటిడ్ సర్జరీలు కూడా చేస్తామని వివరించారు. ఈ సేవలు సెమీ అర్బన్ ప్రాంతాల్లో అందుబాటులో లేవని, ఇది వైద్య రంగంలో ఒక ముందడుగని ఆయన తెలిపారు. ఆగస్టు నెల చివరి వరకు ఉచిత కన్సల్టేషన్, డాప్లర్ పరీక్షలను అందిస్తున్నట్లు హాస్పిటల్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యేంద్ర రామ్‌నాథ్, మెడిసిటీ గ్రూప్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్, మెడినోవా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ వర్సిటీలో బిసి సెల్ ఏర్పాటు అభినందనీయం

**-మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపిన పలువురు నేతలు**



**అత్తాపూర్ ఆగస్టు8, ప్రభాతవార్త :**
బిసి విద్యార్థుల కోసం ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిసి సెల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిసి సెల్ ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను బుద్వేల్ రైల్వే స్టేషన్‌కు చెందిన నాయకులు మాధవ రెడ్డి,సుధాకర్ గౌడ్,కర్ణకర్ గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వర్సిటీలో బిసి సెల్ ఏర్పాటుకు సహకరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ... విద్యార్థులు బిసి సెల్‌ను సద్వినియోగం చేసుకొని చట్టం ప్రకారం రావాల్సినవి సాధించుకోవాలని సూచించారు.

## జోవియల్ స్కూల్లో రక్షాబంధన్



జోవియల్ స్కూల్లో సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొన్న ప్రిన్సిపల్, విద్యార్థులు

**యాచారం,ఆగస్టు8, ప్రభాతవార్త :**
యాచారం మండల కేంద్రంలోని జోవియల్ హైస్కూల్లో రక్షాబంధన్ పురస్కరించుకొని ఉపాధ్యాయుల విద్యార్థులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రేఖ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రక్షాబంధన్ భారతీయ సాంస్క ృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా భావిస్తామన్నారు. అన్నా చెల్లెలి అనుబంధానికి ఆత్మీయతలకు మారుపేరన్నారు. పాఠశాలలో విద్యార్థి విద్యార్థినులకు రక్షాబంధనం చేపట్టి కార్యక్రమంలో నిర్వహించి సాంస్క ృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**దౌల్తాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త:**
ప్రజలు సీజనల్ వ్యాదుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండలపరిదిలోని ఈర్లపల్లి గ్రామపంచాయితీ కార్యదర్శి బసంత్ అన్నారు.ఈ సంధర్భంగా పంచాయితీ కార్యదర్శి బసంత్ మాట్లాడుతూ... ప్రజలు ఎవరికివారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.వర్షాకాలంలో ఎలాంటి అంటూవ్యాధులు సోకకుండా ఉండేందుకు ఎవరికివారు ప్రత్యేక శ్రద్దవహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.తడి,పొడి చెత్తను గ్రామ పంచాయితీ ట్రాక్టర్ లో వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి



మొక్కలను పంపిణి చేస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

**ఆమనగల్లు, ఆగస్టు8, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రజలు నడుంబిగించాలని ఆమనగల్లు మున్సిపాలిటి కమిషనర్ శంకర్‌నాయక్ అన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటిని బాధ్యతతో సంరక్షిస్తే భావి తరాలకు పచ్చదనంతో మనుగడకు దోహదపడవచ్చని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటి ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవ వేడుకలు నిర్వహించారు. సిబ్బందితో కలిసి కమిషనర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదర్శనగర్ కాలనీలో ప్రజలకు మొక్కలు నాటి వాటి ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ సొంతస్థలాల్లో మొక్కలు నాటుకోవాలని ప్రచారం నిర్వహించారు. భూమండలంపై పచ్చదనం పెంపొందించుకుంటేనే జీవరాశుల మనుగడ సాధన సాధ్యమవుతుందన్నారు. మొక్కలు స్వీకరించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అలాగే విఠాయిపల్లిలో అధికారులు మొక్కల పంపిణి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు అధికారి సురేందర్, శ్రీధర్‌నాయక్, పర్వతాలు, శంకర్‌నాయక్, ఆంజనేయులు, శంకరయ్య, మున్సిపాలిటి సిబ్బంది, ఉన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమేరాల పాత్ర కీలకం
### తలకొండపల్లి ఎస్ఐ శేఖర్



సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఎస్ఐకి విరాళం అందజేస్తున్న దృశ్యం

**తలకొండపల్లి ఆగస్టు8, ప్రభాతవార్త :**
నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల కీలకమైన పాత్ర అని తలకొండపల్లి ఎస్ఐ కె. శేఖర్ అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామంలో లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అమరేందర్ 20,000 కల్యాంకర్ యాదిలాల్ 10,000 మరియు ఈదమయ గౌడ్ 3000 సిసి కెమెరాల గురించి తమ వంతు సహాయంగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాల నివారణలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోసిస్తున్నాయని అన్నారు, సీసీ కెమెరాలు ఉన్నట్లయితే ఆ ప్రాంతంలో నేరాలు చేయడానికి నేరగాళ్లు వెనకాడుతారు అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల పట్టణంలో దొంగతనాలు, నేరాలు జరగకుండా నిరోదించవచ్చు అన్నారు. పోలీసు కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా మారాయని అన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉంటే సంఘటనకు గల కారకులను ఫ్యుటేజీ ఆధారంగా త్వరగా గుర్తించవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా గుర్తు తెలియని వాహనాలను పట్టుకోవచ్చు అన్నారు. కావున ప్రతి ఒక్కరు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి నేరాల నివారణలో పోలీసు శాఖలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కానిస్టేబుల్స్ జాషువా, శ్రీనివాసులు మరియు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## పండుగల సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి



పండుగల సాయన్న జయంతి వేడుకలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**బొంరాస్‌పేట్, ఆగష్టు 8, ప్రభాతవార్త :** తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరుగాంచిన పండుగల సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాజీ శాసన సభ్యుడు పట్నం నరేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.శుక్రవారం మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగల సాయన్న జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన గొప్ప బహుజన యోధుడు పండుగల సాయన్న అని కొనియాడారు.అందుకే ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే పట్నం డిమాండ్ చేశారు. ముందుగా పండుగల సాయన్న చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముదిరాజ్ సంఘ నేతలతో కలసి కేక్ కట్ చేసి జయంతి వేడుకల ు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బారాసమం డలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, తున్కిమెట్ల మాజీ ఎంపీటీసీ తిరుపతయ్య, లగచర్ల సురేష్,తోత్నమోని లచప్ప , నిరంజన్ ఉన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తాచాటాలి

**నవాబుపేట ఆగస్టు 8,ప్రభాతవార్త :**
రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు శ్రమకోర్చి పనిచేయాలని బిజెపి సీనియర్ నాకుడు మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, పార్టీ జిల్లా ఇంచార్జీ ప్రతాప్‌రెడ్డిలు పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ అధ్యక్షతన బిజెపి కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది బిజెపి ప్రభుత్వమేనని వారన్నారు. ప్రతి కార్యకర్త అప్రమత్తమై ప్రజలను ప్రభావితం చేయాలని వారు అన్నారు. వార్డు సభ్యుడు నుండి ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికల వరకు ప్రతి పదవికి పోటి చేయాలని విజయం సాధించాలని చెప్పారు. ప్రజలు పార్టీ పట్ల మంచి అభిప్రాంతో ఉన్నారని వారి ఆశయం మేరకు వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా బూతు స్థాయి అధ్యక్షులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాలని అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని వారన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటి సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సార జగన్, నాయకులు గోపాల్‌రెడ్డి, దళతమోర్చ జిల్లా అధ్యక్షుడు గాలయ్య, జైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఎం రత్నం, రాంచంద్రయ్య, కె నర్సింహులు, అనంతయ్య సిహెచ్ లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బిజెపి నాయకులు

## అవకాశవాద బిజెపి రాజకీయాలు ప్రజలు నమ్మరు : దళపతిగౌడ్

**మాడ్గుల,ఆగస్టు08,ప్రభాతవార్త:-**
కల్వకుర్తిలో బిజెపి పార్టీ నాయకులు అవకాశవాద రాజకీయాలు చేస్తుందని కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గాడెమోని దళపతి గౌడ్ అన్నారు.బిజెపి అధ్వర్యంలో నిర్వహించిన ధర్నను ప్రజలు నమ్మడంలేదన్నారు.పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో భష్టు పట్టిన తెలంగాణ ఆర్థిక స్థితిగతులను సరిచేసుకుంటూ ప్రజలకిచ్చిన హామిలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంపై బిజెపి నాయకుల ఆరోపణలు తగదన్నారు. ప్రజల మద్దతుతో జడ్‌పిటిసిగా,శాసనమండలి సభ్యులుగా, ఎమ్మెల్యే గా నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన రేవంత్ రెడ్డిని పలుమార్లు పోటిచేసి ప్రజామోదం పొందలేని నాయకులు విమర్శిస్తుంటే ప్రజలంతా నవ్వుకుంటున్నారు అన్నారు.రాష్ట్రంలో బిజెపికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులుండి కూడ తెలంగాణలో నయా పైసా అభివృద్ధికి కృషి చేశారేమో బిజెపి నాయకులు సమాధానం చెప్పాలి అన్నారు. గత తెలంగాణ ప్రభుత్వానికి బిజెపి వంతపాడడంతో అప్పుల కుప్పగా మారిన రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్న కాంగ్రెస్ ను విమర్శించడం మాని చాతనైతే కేంద్రం నుండి తెలంగాణకు బకాయి నిధులు విడుదల చేయించాలని డియాండ్ చేశారు. 42 బీసి రిజర్వేషన్లకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మద్ధతు పలుకుతుంటే.. ఆ పార్టీ స్థానిక నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేయడం వారి ద్వంద నీతికి నిదర్శనం అన్నారు.పింఛన్ల పంపిణిపై ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టతనిస్తున్నదని తెలిసి కొందరు బిజెపి నాయకులు ఆదరబాదరగా మాడ్గులలో అర్థం లేని ఆరోపణలతో అవకాశవాద ఆందోళన చెపట్టినా ధర్న చూసి ప్రజలు వారి మాటలు నమ్మేస్థితిలో లేరు అన్నారు.కెఎల్ఐ పూర్తికి గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేస్తే కాలువల్లో కంపచెట్లు మొలువగా ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రత్యేక చొరవతో కెఎల్ఐ భూనిర్వాసిత రైతులకు పరిహారం అందజేయడం మొదలు అసంపూర్తి పనులు కొనసాగుతున్నాయన్నారు. అంతేగాకుండ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మాడ్గుల మండలాభివృద్ధికి 110 కోట్ల రూపాయల నిధుల మంజూరుకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, టిపిసిసి కార్యదర్శి సూధిని రాంరెడ్డిలను విమర్శించడం బిజెపి నాయకుల దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండు దఫాలుగా అధికారం చేపట్టినప్పటికి ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్న 15 లక్షల రూపాయలు ఏమయ్యాయో బిజెపి నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలి అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నేతలు భట్టు కిషన్ రెడ్డి, సూధిని రాంరెడ్డిలపై బిజెపి నాయకుల విమర్శలను ఖండిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దళపతిగౌడ్

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, ఆగష్టు 08, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్సు హాలు నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలన్నా రు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించ నున్నామని అందుక నుగుణంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకలకు వచ్చే అతిథికి పోలీసు గౌరవ వందనంతో పాటు వేడుకలలో పోలీసు బందోబస్త్ ఏర్పా ట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. వేడుకల సందర్భంగా విద్యుత్ అంత రాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు స్టాళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, ఎం. సుదీర్, జిల్లా రెవె న్యూ అధికారి మంగీలాల్, అడిషనల్ ఎస్పి మురళీధర్, ఆర్డిఓ వాసుచంద్ర,





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

## పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**తలకొండపల్లి ఆగస్టు 8, ప్రభాతవార్త :**
తలకొండపల్లి ఆత్మీయ అనుబంధాల వేడుక రక్షాబంధన్ అని కరెస్పాండెంట్ జి. రాజేందర్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు జి. తిరుపతయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రధన గ్రామంలోని సక్సెసెస్ ద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలోని శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టించుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు రాఖీ పండుగ సందర్భంగా పాఠశాలలో బోడుపైన వినూత్నంగా డిజైనింగ్ వెసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ జి.రాజేందర్ గౌడ్, మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. రాఖీ పండుగ సోదరీ సోదరుల ప్రేమానురాగాలకు ప్రతీక అని, రక్షాబంధన్ పండుగను ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ అని , అన్నదమ్ముళ్ల అక్కాచెల్లెల్లు ఒకరినొకరు రక్షగా ఉండేందుకు రక్షాబంధన్ నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలోని కరెస్పాండెంట్ జి. రాజేందర్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు జి.తిరుపతయ్య గౌడ్, ఉపాధ్యాయులు అనూష, కె. స్వప్న, కృష్ణవేణి, లిట్టి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాతమెటల్ రోడ్డు స్థానంలోనే బిటి రోడ్డు వేయండి



**కేశంపేట ఆగస్టు 8 ప్రభాతవార్త**
గత 20 సంవత్సరాలుగా మెటల్ రోడ్డు గా ఉన్న స్థానంలోనే ఇప్పుడు వేస్తున్న బీటీ రోడ్డు నిర్మించాలని బైర్కాన్ పల్లి గ్రామానికి చెందిన రైతులు గురువారం కేశంపేట తహసిల్దార్ ఆజం అలీ కి వినతి పత్రాన్ని అందించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వారి స్వలాభం కోసమే రైతులను ఇబ్బంది పెట్టి బీటి రోడ్డు నిర్మాణాన్ని రైతుల పొలాల నుండి తీసుకువెళ్తున్నారని, పాత మెటల్ రోడ్డు ఉన్న స్థానంలోని నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డును ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తూ తహసిల్దార్ ఆజం అలీ కి వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. వినతి పత్రాన్ని సమర్పించిన రైతులు రైట్ కంటి రామచంద్రి, రైకటి కరుణాకర్, గుండెల నరసింహ, రాయి కంటి ప్రభాకర్, గుండెల నరసింహ పాల్గొన్నారు.

## 10న పెద్దేముల్‌లో 25వ హనుమాన్ చాలీసా పారాయణం

**పెద్దేముల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఈ నెల 10న ఆదివారం పెద్దేముల్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో 25వ వారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గత 24 వారాలుగా చిన్నారులలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తు రేపుఆదివారం 25వ వారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇట్టి కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా, వక్తగా అడికే కార్తిక్ (ఎంసిఏ లా,జర్నలిజం హనుమాన్ కథ వాచక్) హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి హిందు సోదరులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున హాజరైవిజయవంతం చేయాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్‌కు రాఖీ కట్టిన బిజెపి నేతలు



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్‌కు రాఖీ కట్టిన మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్‌రెడ్డి

**మేడ్చల్, ఆగస్టు 8. ప్రభాతవార్త :**
గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్ కు మేనేజర్ శ్రీనివాస్ గౌడ్ కు సానిటేషన్ సూపర్వైజర్ నరసింహారెడ్డి, సత్యం, వినయ్ , వార్డ్ ఆఫీసర్లు స్పెషల్ ఆఫీసర్లకు మున్సిపల్ బీజేపీ మహిళా నేతలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్‌రెడ్డి మహిళా మోర్చా అధ్యక్షురాలు బట్టి కాడి నవనీత తదితరులు పాల్గొన్నారు.



**రక్షబందన్ సందర్భంగా మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు బీజేపీ మహిళా నేతలు రాఖీలు కట్టారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు మన్మద్‌రావు, శ్రీనివాస్, సిబ్బందికి మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, నాయకురాళ్లు పుష్పరెడ్డి, అనిత, హేమలతరెడ్డిలు రాఖీలు కట్టి మిఠాయిలు పంచిపెట్టారు.**

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత
### హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్సీ పూజలు



హనుమాన్ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి తదితరులు.

**నందిగామ ఆగస్టు 8 ప్రభాతవార్త:**
ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ ఎన్ నవీన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామపంచాయతీ పరిధిలో పృథ్వీ కాలనీలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గం ద్వార ముక్తి మార్గం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జిల్లెల్ల జనార్దన్ రెడ్డి, అడ్వకేట్ విక్రమ్ శర్మ, తుమ్మల నర్సింలు యాదవ్, తుమ్మల జగన్, నరేష్, శ్రీనివాస్, చందు, పరమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు

**నందిగామ ఆగస్టు 8**

**ప్రభాతవార్త**
పవిత్ర దినాలుగా పరిగణించే శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని నందిగామ మండలం లోని ఆయా గ్రామాలలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ధాన్య లక్ష్మి, ధైర్యలక్ష్మి, శౌర్యలక్ష్మి,కార్య లక్ష్మి,విజయలక్ష్మి, విద్యాలక్ష్మి,అష్టలక్ష్మి రూపాయలలో దర్శనమిచ్చే అమ్మవారి కరుణా, కృప కటాక్షంతో ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు సిద్ధించాలని పూజలు చేస్తూ మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం శుభ సందర్భంగా మండలంలో ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది.



శ్రావణమాసం సందర్భంగా వరలక్ష్మి వ్రత పూజ చేసిన మహిళలు

## సంకల్పానికి ప్రతీక వరలక్ష్మి వ్రతం..



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

**షాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
తమ కుటుంబం సకల సౌభాగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని షాబాద్ మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మి వ్రతం చేశారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో లక్ష్మి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. మండలంలోని పలు దేవాలయాల్లో, ఇళ్లలోను అమ్మవారిని పసుపు, కుంకుమ, చందనంతో ప్రత్యేకంగా అలంకరించి వ్రత కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేధ్యంగా సాయసం, లడ్డూ, వడతోపాటు పలు రకాల వంటకాలను సమర్పించారు.

## అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



నాగారం సెరినిటి పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటున్న దృశ్యం

**కీసర,ఆగస్టు8,ప్రభాతవార్త:**
అన్నా చెల్లళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని నాగారం సెరినిటి పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత పేర్కొన్నారు.శుక్రవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని నాగారం,రాంపల్లి సెరినిటి పాఠశాల విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని నేను నీకు రక్ష,నాకు నీవు రక్ష మనిద్దరం దేశానికి రక్ష అని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి నోముల వసంత మాట్లాడుతూ అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దుద్యాల్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి





పండుగల సాయన్న జయంతిలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

**దుద్యాల్, ఆగష్టు 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండగ సాయన్న జయంతి వేడుకల ు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముదిరాజ్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ, టపాసులు కాల్చుతూ జయంతి వేడుకలు నిర్వహించారు. పలువురు ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ, చరిత్ర విస్మరించిన యోధుడు పండుగ సాయన్న అని అన్నారు. పండగ సాయన్న బహుజన వీరుడు అని, దొరల ు ఎదిరించి పేదోడికి పంచిన తెలంగాణ రాబిన్ వుడ్ అని బహుజ నుల బంధూక్ అని అన్నారు. ఇంతటి వీరుడి చరిత్ర ను వక్రీకరించి ఆయ న ు గజదొంగగా చిత్రీకరించారని అన్నారు. పండగ సాయన్న గొప్ప వీరుడు, పేదల ఆకలి తీర్చిన దేవుడు అని, అతని నిజమైన చరిత్ర వారి బిడ్డలుగా మనమే రాయాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ నాయకు లు, మత్స్యకారులు బసప్ప, మెరుగు సంజీవ్ కుమార్, కాలిగే విజయ్ కుమార్, మడిగే శ్రీనివాస్, జయరాములు, సత్యనారాయణ, రాములు, కేశవులు, రమేష్, కృష్ణ, వెంకట య్య, సురేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.